నిట్‌లో ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

హనుమకొండ చౌరస్తా, జూలై 17 : వరంగల్ నిట్‌లోని సెంటర్ ఫర్ టీచింగ్ అండ్ లెర్నింగ్ (సీటీఎల్) సహకారంతో కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగంలో 'క్వాంటం కంప్యూటింగ్ : అల్గారిథమ్స్, అప్లికేషన్స్'పై ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ) నిర్వహించింది. సీటీఎల్‌కు విద్యా మంత్రిత్వ శాఖ పండిట్ మదన్ మోహన్ మాలవీయ 'నేషనల్ మిషన్ ఆన్ టీచర్స్ అండ్ టీచింగ్' ద్వారా నిధులు సమకూరుస్తున్నారు. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్‌లోని సెంటర్ ఫర్ క్వాంటం టెక్నాలజీస్‌లో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ప్రొఫెసర్, ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ రాహుల్ జైన్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్వాంటం కంప్యూటింగ్ ప్రాముఖ్యతను ఫైనాన్స్, కెమిస్ట్రీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్టిమ్యులేషన్, కమ్యూనికేషన్‌పై వివరించారు. ప్రపంచవ్యాప్తంగా క్వాంటం కంప్యూటింగ్ బాగా ప్రాచుర్యం పొందిందని, అనేక దేశాలు ఫ్లాగ్‌షిప్ గ్రాంట్లను అందిస్తున్నాయని, అనేక ప్రధాన ప్రైవేట్ కంపెనీలు క్వాంటం కంప్యూటర్లను అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. ఈఎఫ్ డీపీకి గౌరవ అతిథులుగా సీటీఎల్ హెడ్ ప్రొఫెసర్ కిశోర్ కుమార్, సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్ పద్మావతి, వెంకట సుబ్బారెడ్డి, యూఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

బీసీ కుల గణన సాధన సభను జయప్రదం చేయాలి

హనుమకొండ, జూలై 17 : హంటర్‌రోడ్డులో గురువారం ఉదయం 11గంటలకు సత్యం కన్వెన్షన్ హాల్‌లో జరుగనున్న సమగ్ర బీసీ కులగణన సాధన యాత్ర సభకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీసీలు అత్యధిక సంఖ్యలో పాల్గొని బీసీల ఐక్యతను చాటి సభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. హనుమకొండలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి రిజర్వేషన్లను బీసీ జనాభా లెక్కల ప్రకారం పెంచే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తి లేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సమగ్ర కులగణన చేపట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లను పెంచుతామని కామారెడ్డి సభలో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన హామీనిచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని, ఎన్నికల్లో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను ప్రభుత్వానికి గుర్తు చేయడానికి, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కామారెడ్డి నుంచే బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో బీసీ కుల సంఘాల ఐకాస ఆధ్వర్యంలో సమగ్ర కులగణన సాధన యాత్రను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ యాత్ర ఈ నెల 14న కామారెడ్డి నుంచి ప్రారంభమై రాష్ట్ర వ్యాప్తంగా 17 రోజుల పాటు సాగుతుందన్నారు. గురువారం హనుమకొండలో జరుగనున్న సభకు కులాలు, పార్టీలకు అతీతంగా బీసీలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

వెంకటేశ్వర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, జూలై 17 : కాంగ్రెస్ రైతులకు ఎలాంటి షరతులు పెట్టకుండా ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డు ప్రామాణికంగా తీసుకొని రుణమాఫీ చేస్తామనడం సరికాదన్నారు. వెంటనే తమ నిర్ణయాన్ని మార్చుకొని బ్యాంకులో వ్యవసాయ రుణం తీసుకున్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని లేకపోతే రైతాంగం పక్షాన ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953

CHANGE OF NAME
I, RAGI VANI (New Name) W/o RAGI SHASHIDHAR and D/o GUGGILLA RAVINDER, previously called GUGGILLA VANI (Old Name), Residing at H.No. 2-7-1352/6/1, Vijaypal Colony, Waddepalli, Hanamkonda, Hanumakonda District. T.S. India and solemnly declare.

OLD AGE HOME
★ ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325763-All

వ్యవసాయ భూమి అమ్మబడును

★12ఎ॥ తరి పొలము, 10ఎ॥ రాగడి, వీటికి నీటి సౌకర్యం కలదు. ముస్త్యాలపల్లి గ్రామం, నడికూడ మం॥, హనుమకొండ జిల్లా. ఆసక్తి గల వారు సంప్ర: పి.వసంత కుమార్ రెడ్డి, సెల్: 9652225908
NTW-323325

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

PLOT FOR SALE
★1089 గజముల ప్లాట్, సర్వే నెం. 187, L.R.S. కూడా కట్టబడినది. దర్గా గ్రామం, కాజీపేట మండలం, ఆసక్తి గల వారు సంప్ర: పి.వసంత కుమార్ రెడ్డి, సెల్: 9652225908
NTW-323326

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

కొనసాగుతున్న బదిలీల కౌన్సెలింగ్

- నేడు ట్రెజరీ, పబ్లిక్ హెల్త్, మున్సిపాలిటీ శాఖలకు..
- రెండో రోజు 107మంది హాజరు

బదిలీల కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

హనుమకొండ, జూలై 17 : రెండో రోజు బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగింది. బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మరో ఎనిమిది ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు జిల్లా అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా పరిషత్‌లో 73 మంది, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ నుంచి 10 మంది, పీఆర్ ఇంజినీరింగ్‌లో ఐదుగురు, డీసీ సోషల్ వెల్ఫేర్ నుంచి ఐదుగురు, కార్మిక శాఖ నుంచి నలుగురు, మిషన్ భగీరథ (ఆర్‌డబ్ల్యూఎస్) నుంచి ఇద్దరికి, బీసీ వెల్ఫేర్ నుంచి ఆరుగురు, డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్ నుంచి ఇద్దరికి మొత్తం రెండో రోజు 107 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. మొదటి రోజు 8 శాఖలకు చెందిన 155 మందికి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించగా, రెండు రోజుల్లో కలిపి 16 ప్రభుత్వ శాఖల నుంచి ఇప్పటి వరకు 262 మందికి కౌన్సెలింగ్ జరిగింది. గురువారం ట్రెజరీ, పబ్లిక్ హెల్త్, మున్సిపాలిటీ డిపార్ట్‌మెంట్లకు చెందిన ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. జడ్పీకి సంబంధించి మొత్తం 73 మందికి కౌన్సెలింగ్ చేశారు. వీరిలో 17 మంది జూనియర్ అసిస్టెంట్లు, 9 మంది రికార్డు అసిస్టెంట్లు, 45 మంది ఆఫీస్ సబార్డినేట్లు, ఇద్దరు నైట్ వాచ్‌మెన్స్ ఉన్నారు.

'గద్దర్' సదస్సును విజయవంతం చేయాలి

హనుమకొండ, జూలై 17 : ఈ నెల 19న నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో 'తెలంగాణ పోరు– గద్దర్ పాత్ర' అనే అంశంపై జరుగబోయే సదస్సును విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. బుధవారం బాలసముద్రంలోని ఏకశిల పార్కులో విద్యార్థి సంఘాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకాలంలో గద్దర్ చేసిన పోరాటం, ఆయన పాత్రను ప్రపంచానికి తెలియజేయాలనే లక్ష్యంతో సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ప్రొఫెసర్ కంచ ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరవుతారని, గద్దర్ మరణించి ఏడాది కావస్తున్న సందర్భంగా వరంగల్‌లో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని, కాళోజీ కళాక్షేత్రానికి గద్దర్ నామకరణం చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, మేధావులు, ఉద్యోగులు, గద్దర్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎమ్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేశ్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, టీజీవీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ రంజిత్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ కాడపాక రాజేందర్, మణి పాల్గొన్నారు.

దొంగల అరెస్టు

దామెర, జూలై 17 : పోలీసులమంటూ ప్రజలను బెదిరించి చోరీకి పాల్పడుతున్న దొంగలను అరెస్టు చేసినట్లు పరకాల రూరల్ ఇన్‌చార్జి సీఐ క్రాంతికుమార్ తెలిపారు. బుధవారం దామెర పీఎస్‌లో నిందితుల అరెస్టును చూపి వివరాలను వెల్లడించారు. గూడెప్పాడ్ నుంచి హనుమకొండ వెళ్తున్న ఓ కారు దామెర క్రాస్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై కొంక అశోక్, పోలీసులను చూసి అందులోని వ్యక్తులు తప్పించుకోవడానికి ప్రయత్నించారు. కారును ఆపి పోలీసులు వారిని విచారించారు. విచారణలో హనుమకొండకు చెందిన ఓర్సు గణేశ్, వల్లెపు రాజు, ఓర్సు చిరంజీవి, అలకుంట నరేశ్ చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వీరు ఈ నెల 15న రాత్రి మద్యం కోసం డబ్బులు లేక పోవడంతో నడికూడ మండలం రామకృష్ణాపురం శివారులోకి వస్తున్న ఓ కారును ఆపి పోలీసులమంటూ కారులో ఉన్న వ్యక్తులను దింపి కర్రలతో దాడిచేసి గాయపర్చారు. అనంతరం వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లు, డబ్బులు, కారును లాక్కున్నారు. కారులో కంఠాత్మకూరు ముఖ్య కూడలివద్దకు రాగానే బారికేడ్లను వీరు నడుపుతున్న కారు ఢీకొట్టింది. ఘటనా ప్రదేశానికి స్థానికులు రాగా, దొంగలు వీరితో దుర్భాషలాడారు. దీంతో స్థానికులు, దొంగలకు మధ్య తోపులాట జరుగగా దొంగలు కారును అక్కడే వదిలేసి వారు తీసుకువచ్చిన కారులో తప్పించుకున్నారు. నిందితుల వద్ద నుంచి రెండు కర్రలు, ఆరు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకుని పరకాల కోర్టులో హాజరుపర్చామని సీఐ తెలిపారు.

అమ్మవారి దర్శనం కోసం క్యూలో బారులు తీరిన భక్తులు

ఘనా క్రమంలో భద్రకాళీ

వరంగల్, జూలై 17 : భద్రకాళీ శాకంబరీ నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పన్నెండో రోజు అమ్మవారిని ఘనా మాతగా అలంకరించారు. బుధవారం నిత్యాహ్నికం పూర్తి చేసిన అనంతరం కాళీ క్రమం అనుసరించి ఉదయం భద్రకాళీ అమ్మవారిని ఘనా క్రమంలో, షోడాష క్రమాన్ని అనుసరించి సాయంత్రం నీలపతాక నిత్యగా అలంకరించి పూజలు చేశారు.

పోటెత్తిన భక్తజనం..

తొలి ఏకాదశి సందర్భంగా భద్రకాళీ అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి వచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి పోయింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, తాగునీటి వసతి కల్పించారు.

డీలక్స్ మహిళా ప్రయాణికులకు లక్కీడ్రా తీసి విజేతలను ప్రకటిస్తున్న ఆర్ఎం విజయభాను

ఆర్టీసీ డీలక్స్ మహిళా ప్రయాణికులకు బహుమతులు

హనుమకొండ చౌరస్తా, జూలై 17 : ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళలకు లక్కీ డ్రా ద్వారా బహుమతులను వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను అందజేశారు. బుధవారం హనుమకొండ బస్‌స్టేషన్‌లో హనుమకొండ–ఉప్పల్–హైదరాబాద్ రూట్‌లో తిరిగే డీలక్స్ బస్సులకు సంబంధించి మహిళ ప్రయాణికుల లక్కీ డ్రా కార్యక్రమం హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్ఎం పాల్గొని డ్రా తీసి విజేతలను ప్రకటించారు. ఇందులో కొత్తగూడెంకు చెందిన మండల రాజ్యం(ప్రథమ), వరంగల్ ఎస్‌బీహెచ్ కాలనీకి చెందిన ఎం ఊర్మిళ(ద్వితీయ), హనుమకొండ గుడిబండల్‌కు చెందిన మౌనిక (తృతీయ) ఉన్నారు. అనంతరం ఆర్ఎం మాట్లాడుతూ.. డీలక్స్ బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలకు ప్రతి నెల 1, 16వ తేదీల్లో ఈ గిఫ్ట్ స్కీం ద్వారా బహుమతులను అందజేస్తామన్నారు. డీఆర్ఎం కే భాను కిరణ్, మాధవరావు, వరంగల్–1 డిపో, వరంగల్–2, జనగామ, తొర్రూ రు, మహబూబాబాద్, భూపాలపల్లి, నర్సంపేట, పరకాల డిపోల మేనేజర్లు వీ మోహన్ రావు, జీ సురేశ్, వీ జ్యోత్స్న, పద్మావతి, శివప్రసాద్, లక్ష్మీనారాయణ, ప్రసన్నలక్ష్మి, రవిచందర్, హనుమకొండ డిపో మెకానిక్ సూపర్‌వైజర్ వీ చంద్రశేఖర్, ట్రాఫిక్ సీఐ కేఎస్ రావు పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ గుట్టపై అక్రమ తవ్వకాలు

ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

కమలాపూర్, జులై 17 : మండల కేంద్రంలోని సమ్మక్క–సారలమ్మ గుట్టపై అక్రమంగా తవ్వకాలు చేస్తూ భూమిని చదును చేస్తున్నట్లు జాతర కమిటీ చైర్మన్ ఆన్‌కార్ అశోక్, డైరెక్టర్లు చంద్రశేఖర్, రాజు, భిక్షపతి, సాంబయ్య బుధవారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 720లో సమ్మక్క–సారలమ్మ ఆలయానికి కేటాయించిన భూమిని చదును చేస్తూ కబ్జా చేసేందుకు యత్నిస్తున్నట్లు తెలిపారు. భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆరు కిలోల గంజాయి, బైక్ స్వాధీనం

సుబేదారి, జూలై 17 : గంజాయి విక్రయిస్తున్న నిందితుడిని సుబేదారి పోలీసులు అరెస్టు చేసి ఆరు కిలోల గంజాయి, బైక్ స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సుబేదారి పోలీసు స్టేషన్‌లో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి నిందితుడి అరెస్టు చూపించి వివరాలు వెల్లడించారు. కాజీపేట విష్ణుపురికి చెందిన ఫ్రాన్సియా ఆదాం కారు డ్రైవింగ్ చేస్తూ గంజాయికి అలవాటు పడ్డాడు. భద్రాచలానికి చెందిన హుస్సేన్ ద్వారా ఒడిశా నుంచి గంజాయి తెప్పించుకొని వరంగల్ నగరంలో తెలిసిన వారికి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. బుధవారం హంటర్‌రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఫ్రానియా ఆదాం అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని తనిఖీచేయగా, ఆరు కిలోల గంజాయి లభించినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్సై గాలిబ్, ఏఎస్సై రాజయ్య, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆత్మకూరు, జూలై 17 : ఆత్మకూరుకు చెందిన మాచర్ల రాజేందర్ గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. అతడి కుటుంబాన్ని బుధవారం తోటి స్నేహితులు పరామర్శించి, రూ.28వేల ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో శ్రీనివాస్, లక్ష్మీరాజు, నత్తి ఆనందరావు, మాచర్ల రఘు, రేవూరి రత్నాకర్, వీ లింగమూర్తి, నాగరాజు, ఆంధ్రయ్య, టీ నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా బీరన్న బోనాలు

డప్పుచప్పుళ్లతో బోనాలు తీసుకెళ్తున్న గొల్లకురుమలు

కమలాపూర్, జులై 17 : మండలంలోని ఉప్పల్ గ్రామంలో గొల్లకుర్మ కులస్తులు బీరన్న బోనాలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. తొలి ఏకాదశి పండుగ సందర్భంగా ప్రతి ఏటా గొల్లకుర్మలు తమ ఆరాధ్య దైవమైన బీరన్నకు బోనాలు సమర్పిస్తారు. మహిళలు ఇంటికో బోనం చేసుకుని డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా బీరన్న ఆలయానికి చేరుకుని స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి బీరన్న స్వామి ఆలయంలో కట్న కానుకలు వేశారు. కార్యక్రమంలో కుల పెద్ద మనుషులు బండారి శ్రీనివాస్, వీరబోయిన ఐలయ్య, అధ్యక్షులు కొనుపుల రాంచందర్, మేకల తిరుపతి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాయినేని తిరుపతిరావు, మాజీ సర్పంచ్‌లు ఎర్రబెల్లి దేవేందర్‌రావు, ర్యాకం మొండయ్య, మాజీ ఉపసర్పంచ్ ఎర్రబెల్లి శ్రీధర్‌రావు, నాయకులు మహారాజు స్వామి, తిరుపతి, ఉపేందర్ పాల్గొన్నారు.

పెంచికలపేటలో..

ఆత్మకూరు : మండలంలోని పెంచికలపేట గ్రామంలో బీరన్న బోనాల పండుగను కురుమ కులస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఇంటికో బోనం ఎత్తుకొని కుటుంబ సమేతంగా బీరన్న దేవాలయానికి డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా చేరుకున్నారు. తొలుత అక్క మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కామరాతి సమేతుడైన బీరన్న దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుందరం హోమ్
నమోదిత కార్యాలయం: నెం. 21, పటుల్లాస్ రోడ్, చెన్నై–600 002. **కార్పొరేట్ కార్యాలయం:** సుందరం టవర్స్, నెం. 46, వైట్స్ రోడ్, చెన్నై–600 014.
శాఖ కార్యాలయం: 1వ అంతస్తు, ''కందకట్ల గేట్‌వే'', కెయుసి క్రాస్ రోడ్, నయిమ్‌నగర్, హన్మకొండ, వరంగల్–506009, ఫోన్ నెం. 0870–2441244.

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(1) మరియు అనుబంధం IVతో చదువబడే సెక్షన్ 13(4) క్రింద జారీ చేయబడినది

సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (SARFAESI) యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి రుణగ్రహీత మరియు సహ–రుణగ్రహీతకు డిమాండ్ నోటీసులు జారీచేసి, సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా డిమాండ్ నోటీసులలో తెలిపిన బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సిందిగా కోరుతున్నారు. రుణగ్రహీత(లు) బకాయి మొత్తాన్ని పూర్తిగా తిరిగి చెల్లించుటలో విఫలం కావడం చేత, SARFAESI యాక్ట్‌లోని రూల్ 8తో చదవబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించి అధీకృత అధికారి దిగువ వివరించబడిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లో సబ్–సెక్షన్ (8) నిబంధన గమనించవలసిందిగా రుణగ్రహీతకు తెలియజేయడమైనది. సదరు ఆస్తితో ఏవిధమైన లావాదేవీ నిర్వహించరాదని మరియు సదరు ఆస్తితో నిర్వహించబడు ఏవేని లావాదేవీలు వాస్తవ చెల్లింపు తేదీ వరకు తదుపరి వడ్డీ, వ్యయం మరియు ఇతర చార్జీలు మొ.గు ఏవైనా వాటితోపాటు దిగువ తెలిపిన మొత్తం కొరకు **సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** చార్జ్‌కు లోబడి వుంటాయని ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

క్ర. సం.	ఫైల్ నం.లు	రుణగ్రహీత & సహ–రుణగ్రహీతల పేరు మరియు చిరునామా	డిమాండ్ నోటీసు/ ప్రచురణ తేది	నోటీసు మొత్తం	స్వాధీనత తేది	మొత్తం బకాయి
1	64100775	శ్రీ మల్లయ్య నల్లబీమ్ (రుణగ్రహీత), ఇం.నెం.4-6-39, కుమార్‌పల్లి, తోటబడి, హన్మకొండ, వరంగల్–506001, శ్రీమతి విజయ లక్ష్మి నల్లబీమ్ (సహ–రుణగ్రహీత)	07 మే 2024	రూ. 4,23,380/-	15 జూలై 2024	రూ. 4,33,527/-
2	64100767		07 మే 2024	రూ. 9,14,638/-	15 జూలై 2024	రూ. 9,40,220/-

ఆస్తి షెడ్యూల్: వరంగల్, హన్మకొండ, కుమార్‌పల్లి, ఇం.నెం.4-6-39 (కొత్తది), 4/51 (పాతది) వద్ద గల, 147 చ.గజాలు విస్తీర్ణం ఆస్తి యావత్తు, **సరిహద్దులు:** ఉత్తరం: అఫ్జల్ బీ యొక్క ఇం.నెం.4-6-40, దక్షిణం: 3' వెడల్పు లేన్, తూర్పు : జి.సమ్మయ్య ఇం.నెం.4-6-38, పశ్చిమం: 30' వెడల్పు రోడ్, ఇది రిజిస్ట్రేషన్ జిల్లా వరంగల్, సబ్‌రిజిస్ట్రేషన్ జిల్లా వరంగల్ జాయింట్, టైటిల్ డీడ్ నం.5478/2011లో పూర్తిగా మరియు మరింత విపులంగా తెలియజేయబడినది.

తేది: 15-07-2024
సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున
అధీకృత అధికారి

భక్తి శ్రద్ధలతో మొహర్రం

మొహర్రం వేడుకల్లో పాల్గొన్న దాస్యం విజయ్ భాస్కర్

నయీంనగర్, జూలై 17 : వడ్డేపల్లిలో మొహర్రం పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. త్యాగం, సహనానికి ప్రతీక మొహర్రం అని అన్నారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

కనుల పండువగా శాకంబరీ ఉత్సవం

మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

ఐనవోలు, జూలై 17 : ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థాన ఉప దేవాలయం భ్రమరాంభికాదేవి ఆలయంలో బుధవారం శాకంబరీ ఉత్సవం కనుల పండువగా జరిగింది. తొలి ఏకాదశి సందర్భంగా ఉదయం నుంచే మల్లికార్జునస్వామి, భ్రమరాంభికాదేవి ఆలయాల్లో ఆకేరు వాగు నుంచి అర్చకులు కొత్త జలాలు తీసుకొచ్చి స్వామి వారికి జలాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భ్రమరాంభికాదేవికి కూరగాయల మాలలు వేసి ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారితో పాటు మహాగణపతి, శివుడు తదితర దేవతామూర్తుల విగ్రహాలనూ కూరగాయలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనం చేసుకొని జలాభిషేకం చేశారు. పూజా కార్యక్రమాల్లో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మధుమతి, రిషితారావు, ఈవో అద్దెంకి నాగేశ్వర్‌రావు, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్ శర్మ, శ్రీనివాస్, నందనం మధుశర్మ, ఉప్పుల శ్రీనివాస్, వేదపండితులు గుట్టు పురుషోత్తమ్మశర్మ, నందనం భాను ప్రసాద్, మడికొండ దేవేందర్ పాల్గొన్నారు.

తొలి ఏకాదశి పూజలు

దామెర, జూలై 17 : మండల కేంద్రంలోని దామేశ్వరాలయం, ఊరుగొండలోని లక్ష్మీనర్సింహస్వామి, నాగేంద్రస్వామి ఆలయాల్లో తొలి ఏకాదశి సందర్భంగా ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో అర్చకుడు తూపురాణి శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

హనుమకొండ : పద్మాక్షికాలనీలోని సిద్ధేశ్వర స్వామిని నవధాన్యాలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. తొలి ఏకాదశి పండుగ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించినట్లు ఆలయ అర్చకులు సిద్ధేశుని రవికుమార్, సురేశ్ కుమార్ తెలిపారు.

దామేశ్వర ఆలయంలో శివలింగం


హౌసుబుజుర్గులో ప్రధాన రహదారిపై సంచరిస్తున్న కుక్కలు

పలు గ్రామాల్లో కుక్కల బెడద

ఇబ్బందులు పడుతున్న ప్రజలు ■ పట్టించుకోని అధికారులు

ఆత్మకూరు, జూలై 17 : మండలంలోని నీరుకుళ్ల, ఆత్మకూరు, హౌసుబుజుర్గు, తిరుమలగిరి, కామారం, గూడెప్పాడ్ గ్రామాల్లోని ప్రధాన రహదారులపై ఎక్కడ చూసినా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రోడ్లపై వెళ్లే వాహనాలను వెంబడిస్తున్నాయి. దీంతో రోడ్లపై కాలినడక వెళ్లేందుకు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం వారు ప్రతి సంవత్సరం కుక్కలను బంధించి వేరే ప్రాంతాలకు తరలించేవారు. కానీ ప్రస్తుతం ఎవరూ పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అందుకే గ్రామాల్లో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందని, గ్రామస్తులపై దాడులకు పాల్పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని కుక్కల బెడదను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రేపు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సు

ధర్మసాగర్, జూలై 17 : ఈ నెల 19న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సు యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలుమారి బాలస్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై పోరాటానికి ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి ఇప్పుడు పట్టించుకోడం లేదని విమర్శించారు. మండలాధ్యక్షుడు కొట్టె రవీందర్, సుధాకర్, బాబు, సంజీవ, రాజన్ బాబు, ఎల్లయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కుడా చైర్మన్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

వేయిస్తంభాల ఆలయాభివృద్ధికి కృషి

కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి

హనుమకొండ చౌరస్తా, జూలై 17 : వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో తొలి ఏకాదశి వేడుకలను కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి జ్యోతి ప్రజ్వలనతో లాంఛనంగా ప్రారంభించారు. తొలిసారి ఆలయానికి వచ్చిన ఆయనకు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. కాగా, 2012లో కలెక్టర్, కుడా వైస్ చైర్మన్ వాకాటి కరుణ దేవాలయ ముందు భాగంలో దేవాదాయ శాఖకు 20 గజాల స్థలాన్ని పూజా సామగ్రికి కేటాయించారని, కానీ కుడా అధికారులు టెండర్ లేకుండా ప్రైవేట్ వ్యక్తికి పూజా సామగ్రి అమ్ముకొనేందుకు అనుమతి ఇచ్చారని కుడా చైర్మన్‌కు ఆలయ ఈవో వెంకటయ్య వినతి పత్రం అందజేశారు. అనంతరం కుడా చైర్మన్ మాట్లాడుతూ.. దేవాలయ ముందు భాగం పరిశీలించానని, గార్డెన్‌లో చిరు కళాకారులకు రేకుల షెడ్డు వేయిస్తానన్నారు. ఈ నెలలోపే కుడా అధికారులతో మాట్లాడి భక్తులకు సౌకర్యాలను కల్పిస్తామన్నారు. వైదిక కార్యక్రమాలను అర్చకులు మణికంఠ శర్మ, ప్రణవ్ నిర్వర్తించారు. చైర్మన్ వెంట అశోక్‌రెడ్డి ఉన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

కేర్ డయాబెటిస్‌లో సేవలు ప్రారంభం

డాక్టర్ సాయిని వెంకటేశ్వర్లు

హనుమకొండ చౌరస్తా, జూలై 17 : డయాబెటిస్‌తో బాధపడుతున్న వారికి అన్ని సేవలు ఒకేచోట అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో కేర్ డయాబెటిస్ సెంటర్‌లో గుండె పరీక్షలకు సంబంధించిన పరికరాలను అందుబాటులోకి తెచ్చినట్లు నిర్వాహకుడు డాక్టర్ సాయిని వెంకటేశ్వర్లు తెలిపారు. హనుమకొండ చౌరస్తా జోయాలుక్కాస్ సమీపంలోని కేర్ డయాబెటిస్ సెంటర్‌లో గుండెకు సంబంధించిన సేవలు, వైద్య పరీక్షలు ప్రారంభించారు. పేషెంట్లకు 2డీ ఎకో, టీఎంటీ, అల్ట్రా సౌండ్ పరీక్షలు అందుబాటులో ఉంటాయని, డయాబెటిస్ పేషెంట్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డయాబెటిస్ ఉన్నవారికి 2 నుంచి 4 రెట్లు గుండె జబ్బులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. డయాబెటిస్ ఉన్నవారిలో రక్తనాళాలు దెబ్బతింటాయని, దీనివల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని, సంవత్సరానికి ఒకసారి పూర్తిస్థాయి గుండె పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్డియాలజీ కన్సల్టెంట్ మాధవి, డాక్టర్లు సాయిని వందన, నవనీత్, రోహిత్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఢీకొని ఒకరి మృతి

న్యూశాయం పేట, జూలై 17 : కాజీపేట రైల్వే జంక్షన్ శివారులో రైలు ఢీ కొట్టిన ఘటనలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. జీఆర్పీ సిబ్బంది, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వెళ్తున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్ కాజీపేట స్టేషన్‌కు వస్తున్న క్రమంలో మతిస్థిమితం సరిగా లేని, గుర్తు తెలియని వ్యక్తి అయోధ్యపురం రైల్వే గేటు సమీపంలో రైలుకు ఎదురుగా వెళ్లాడు. రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైలుకు ఎదురుగా వెళ్తుండగా గేటు వద్ద ఉన్న ప్రజలు పిలిచినా పట్టించుకోకుండా ముందుకెళ్లినట్లు చెప్పారు. అతడి వయసు సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని, ఒంటిపై కేవలం కాషాయ రంగు టవల్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం దవాఖాన మార్చురీలో భద్రపరిచామని తెలిపారు.

టెన్త్ టాపర్లకు నగదు బహుమతి

ఐనవోలు, జూలై 17 : మండలంలోని వెంకటాపురం(కలాన్) జడ్పీ పాఠశాల టెన్త్ టాపర్లకు నగదు పురస్కారం అందజేశారు. వెంకటాపురం గ్రామానికి చెందిన పిండి సంతోష్ (చికాగో మిత్రులు) ఈ విద్యా సంవత్సరం పది ఫలితాల్లో 9.5 జీపీఏ సాధించిన మాదాసి రమ్యకు రూ.10 వేలు, 9.2 జీపీఏ సాధించిన మేటె చైతన్యకు రూ.5 వేలు, 9.2 జీపీఏ సాధించిన మారపాక చరణ్‌కు రూ.5 వేల నగదు పురస్కారాన్ని నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేసినట్లు హెచ్ఎం రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారం అందజేసిన సంతోష్ మిత్రులకు హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.